క్లుప్తంగా

పొగాకు అత్యధిక ధర రూ.365

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ.365 పలికింది. మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు, కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం, కె. ఉప్పలపాడు, కారుమంచి గ్రామాలకు చెందిన రైతులు 946 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 824 కొనుగోలు జరగ్గా 122 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.365 పలకగా, కనిష్ట ధర రూ.205 పలకగా, సరాసరి రూ. 301. 99 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజలు



తిమ్మారెడ్డిపాలెంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామదేవత పోలేరమ్మతల్లి, బొడ్డురాయి సీతామాతకు భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. రెండు వారాల క్రితం గ్రామంలో పోలేమ్మతల్లికి గ్రామస్తులు మూడు రోజులు తిరునాళ్ల జరిపి పొంగళ్ల పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం 16 రోజుల పండుగ సందర్భంగా పోలేరమ్మతల్లికి సీతాలమాతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాలకొండ ఆదాయం రూ.11,28,462

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.11,28,462 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.24,640, తలనీలాలు రూ.56,300, ప్రత్యేక దర్శనం రూ.3,78,000, లడ్డుప్రసాదాలు రూ.2,09,640, అన్నదానం రూ.3,86,005, రూమ్‌అద్దెలు రూ.32,120 వచ్చినట్లు పేర్కొన్నారు.

నేడు పీర్ల చిన షరిగత్తు వేడుకలు



మయాన(పఠాన్) మకానంలో పీర్లకు పూజలు



హాజీపురంలో పీర్ల చావిడీలో కొలువైన పీర్లు

- ముస్తాబైన పీర్ల చావిడ్లు

కనిగిరి రూరల్: ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగ నిరతికి ప్రతీకగా, మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం(పీర్ల పండుగ) చిన షరిగత్ వేడుకలు ఆదివారం కనిగిరి పట్టణంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించనున్నారు. ఈమేరకు నియోజకవర్గంలోని పలు పీర్ల చావిడ్లలో (అషూరా ఖానాల్లో) వివిధ నామ కరణాలు కల్గిన (హజరత్) పీర్లను కొలువు తీర్చి పూజలు అందిస్తున్నారు. కనిగిరి పట్టణంలోని మయాన మకాన్, సయ్యద్ మకాన్, మంగలి మాన్యం, టకారిపాలెంలతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం పీర్ల చిన షరిగత్తు వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు ముజావర్లు సర్వం సిద్ధం చేస్తున్నారు. చిన షరిగత్ పురస్కరించుకుని సయ్యద్ మకాన్ (అక్బర్‌వలి పీర్ల) చావిడిలో ×ఇమామే ఖాశింకు సేరా బాండ్‌నా₹ కార్యక్రమం అత్యంత నియమ నిష్టలతో ముజావర్లు నిర్వహిస్తారు. అనంతరం పీర్లకు జరిగే ప్రత్యేక పూజల్లో కుల, మత, వర్గాల కతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పలు పీర్ల చావిడ్ల వద్ద పీర్ల గ్రామోత్సవ వేడుకలు జరుగుతాయి. ఈ నెల 15వ తేదిన సందు(విడిది దినం) 16న (మంగళవారం) పెద షరిగత్తు, 17న బుధవారం షహదత్(పీర్లు బావికి వెళ్లేరోజు, జలధి కార్యక్రమం), 19న పీర్ల జియారత్‌లు జరుగుతాయని ముజావర్లు తెలిపారు.

హనుమంతునిపాడు: మొహర్రం వేడుకలకు పీర్లు సిద్ధమయ్యాయి. మండలంలోని హనుమంతునిపాడు, హాజీపురం ,రామాయిపల్లి, వీరరాంపురం, నందనవనం, వాలిచర్ల, జమాన్‌ఖాన్‌పల్లి, కొండారెడ్డిపల్లి, మహ్మదాపురం గ్రామాల్లో ఆదివారం చిన్న సరిగత్తు వేడుకలకు చావిడీలో పీర్లను అలంకరించి సిద్ధంగా చేశారు. వివిధ నామకరణాలు కలిగిన పీర్లును నిర్వహకులు అలంకరించి పీర్ల చావిడిలో సిద్ధం చేశారు. ఆయా గ్రామాల్లో ముస్లింలు, హిందువులు కలిసి ఈ మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.



సయ్యద్ మకానంలో పూజలందుకుంటున్న పీర్లు

పండగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న సీఐ రామానాయక్, పక్కన ఎస్సై



మాట్లాడుతున్న డీఎస్పీ రత్నాకరం రామరాజు

- శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు
- డీఎస్పీ రత్నాకరం రామరాజు

కనిగిరి రూరల్: పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ రత్నాకరం రామరాజు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం హిందూ, ముస్లిం మత పెద్దలు, పట్టణ ప్రముఖులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రత్నాకరం రామరాజు మాట్లాడుతూ ఉత్సవ కమిటీలు నిబంధన ప్రకారం నడుచుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొహర్రం, తొలి ఏకాదశి పండుగలు వచ్చినందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పలు సూచనలు చేశారు. వారి వారి మత ఆచారాల ప్రకారం పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ దాసరి వెంకటేశ్వరరావు, ఎస్సై టి.త్యాగరాజు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, అంజుమన్ కమిటీ నాయకులు ఎస్‌కే ఖాశింసా, సయ్యద్ యాసీన్, వివిధ చావిడ్ల ముజావర్లు సయ్యద్ జిలాని, పఠాన్ ఖాదర్ ఖాన్, ఎస్‌కే బారాయిమామ్, వివిధ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

పామూరు: మొహర్రం, కోదండరామస్వామి తిరునాళ్లను ప్రశాంతవాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ ఎం రామానాయక్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం దర్గాకమిటీలు, వడ్డెపాలెం కోదండరామస్వామి ఆలయ కమిటీతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ దర్గాలు, ఆలయం వద్ద కమిటీలు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసుకుని ఎలాంటి అలజడులు లేకుండా చూడాలని, పోలీసుల నిఘా కూడా ఉంటుందన్నారు. ఎవరైనా ఉత్సవాల సందర్భంలో కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై ఎం సైదుబాబు, దర్గాకమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బాబా గుడిలో ప్రత్యేక పూజల్లో భక్తులు

భక్తిశ్రద్ధలతో అఖండ సాయి సప్తాహం

- ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి

కనిగిరి రూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో సాయి అఖండ సాయి సప్తహం కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉదయం బాబా వారికి కాకడ హారతి, అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సానికొమ్ము రంగనాయకులరెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ సానికొమ్ము పద్మ దంపతులు వెలిగించారు. గోపూజ ధనెంకుల తిరుమలయ్య దంపతులు నిర్వహించారు. మహిళా బృందం ఆధ్వర్యంలో సాయి బిక్షా కార్యక్రమం జరిగింది.

మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి ప్రత్యేక పూజలు ..

సాయి సప్తాహం కార్యక్రమాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి ప్రత్యేక పూజలు, ధుని పూజ నిర్వహించారు. బాబావారికి జరిగిన విశిష్ట పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ నాయకులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మరావు, వీసీ రామశాస్త్రి, ఏసీ చెంచులు, తంగుటూరి గోవిందరావు, వాగిచర్ల వెంకటేశ్వర్లు, మండల వెంకటేశ్వర్లు, బద్వేటి కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

మేలురకం పశుగ్రాసంతో ప్రయోజనం

మర్రిపూడి: మేలు రకం పశుగ్రాసం పెంపకంతో పాడిరైతులకు ఎన్నో రకాల ప్రయోజనాలు చేకూరుతాయని మండల పశు వైద్యాధికారి శ్రావణి తెలిపారు. ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు జరుగు పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కూచిపూడి గ్రామంలో ఆమె రైతులతో మాట్లాడారు. సూపర్‌నేపియర్, బాజ్రా, సీవో 1, సీవో 2 తదితర రకాల పశుగ్రాసాలు ఉపయోగించడం వల్ల అధిక పాలదిగుబడి తోపాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయని వివరించారు.



పశుపోషకులతో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రావణి

అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

సీఎస్‌పురం(పామూరు): కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన మండలంలోని గోగులపల్లి గ్రామ సమీపంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అయ్యలూరివారిపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి ఎస్.వెంకటేశ్వరరెడ్డి కనిగిరిలో నివాసం ఉంటున్నాడు. ఆయన శనివారం పని నిమిత్తం స్వగ్రామమైన అయ్యలూరివారిపల్లెకు కారులో వచ్చి తిరిగి కనిగిరి వెళ్తున్నాడు. కారు గోగులపల్లి గ్రామం సమీపంలో రాగానే గేదెలు అడ్డుగా రావడంతో పక్కకు తప్పించగా కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగకపోగా కారు ముందుభాగం దెబ్బతింది. ప్రమాదంలో విద్యుత్‌స్తంభం దెబ్బతింది.



కారు ఢీకొనడంతో విరిగిపోయిన విద్యుత్ స్తంభం

టంగుటూరులో 22 మి.మీ వర్షపాతం



పామూరులో మోస్తారుగా కురుస్తున్న వర్షం



టంగుటూరులో జలమయమైన రోడ్లు

టంగుటూరు: మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. గృహాల్లోకి కూడా వర్షపు నీరు చేరాయి. టంగుటూరు సెంటరు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డు గుంతలమయమై వర్షపు నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వర్షంతో పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగు, మినుము, పెసర తదితర పంటలు వెసుకొని భూమిని సారవంతం చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత తెలిపారు. మండలంలో 22 మి.మీ వర్షపాతం వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

6.2 మి.మీ వర్షపాతం

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలో శనివారం 6.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షం వలన పచ్చిరొట్టి ఎరువులు వేసుకోవటానికి ఎంతో ఉపయోగకరమని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యానవన పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగమన్నారు. శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమైన తేలికపాటి వర్షం శనివారం కూడా కొనసాగటంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. మరోవైపు వాతావరణం చల్లబడటం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో మోస్తారు వర్షం

పామూరు: పామూరుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. గత 5 రోజులుగా తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతుండగా మోస్తారుగా కురిసిన అకాలవర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షం బత్తాయి, నిమ్మ తోటలు సాగు చేసిన రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

6 మి.మీ వర్షపాతం

సింగరాయకొండ: మండలంలో శనివారం 6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. ఈ వర్షం కారణంగా రోడ్లు బురదమయమయ్యాయి. జనుము, జీలుగ, పిల్లి సెనర వంటి పచ్చిరొట్టె ఎరువులు వేసుకోవటానికి అవకాశం ఏర్పడిందని రైతులు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



అన్నదాన ప్రసాదాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరావు తదితరులు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు శనివారం దర్శించుకున్నారు. దర్శనానంతరం దేవస్థానం పరిధిలోని రూ.9 కోట్లతో రిటైనింగ్ వాల్, కింద నుంచి భక్తుల పైకి ఎక్కే మెట్లు పనులను రెండేళ్లుగా సాగుతుండటంపై డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావును ప్రశ్నించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. దేవస్థానం ఎదురుగా షాపులను అద్దెకు తీసుకున్న వ్యాపారులు రోడ్లపై షామియాలను ఏర్పాటు చేయడాన్ని ఎమ్మెల్యే గమనించి, మీకు అద్దెకు ఇచ్చిన రూంల పరిధిలోనే వ్యాపారం చేసుకోవాలని దుకాణదారులకు సూచించారు. అనంతరం భోజనం తయారు చేసే హాలు, డైనింగ్ హాలు తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అన్నదాన ప్రసాదం వడ్డించే విషయాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఈఓకు ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహ, హర్ష తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన మంత్రి



రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి స్వామి

పొదిలి: స్థానిక ప్రభుత్వ వైద్యశాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి శనివారం తనిఖీ చేశారు. అనంతరంగ పలు రికార్డులను పరిశీలించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చిన్న పాటి జబ్బులకు కూడా ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తుండటంపై, సౌకర్యాలు ఉండి కాన్పులు చేయక పోవడంపై ఆయన వైద్యులను ప్రశ్నించారు. ముందుగా టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో మర్రిపూడి అడ్డరోడ్డు వద్ద మంత్రి స్వామికి స్వాగతం పలికారు. ముల్లా ఖుద్దూస్, మీగడ ఓబులరెడ్డి, రసూల్, కాటూరి నారాయణ ప్రతాప్, కాటూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల చిన షరిగత్తు వేడుకలు



శంఖవరంలో పూజలందుకుంటున్న పీర్లు

కనిగిరి రూరల్: కుల, మతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించుకునే మొహర్రం చిన షరిగత్తు వేడుకలు శనివారం మున్సిపాలిటీ పరిధిలోని శంఖరంలో ఘనంగా నిర్వహించారు. మొహర్రం పురస్కరించుకుని పీర్ల చావిడిని విద్యుత్ దీప, పూల అలంకరణలతో బహు సుందరంగా ముస్తాబు చేశారు. పీర్ల చావిడిలో కొలువు తీరిని ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, బారాయిమామ్ తదితర నామ కరణాలు కల్గిన పీర్ల(హజరత్)లకు ప్రత్యేక పూజలు చేశారు. చావిడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండం వద్ద భక్తులు ప్రదక్షిణలు చేశారు. కుల, మత, వర్గాల కతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



విద్యుత్ దీపాలంకరణలో శంఖవరం పీర్ల చావిడి

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన పుణ్యక్షేత్రం శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం ప్రాంగణంలో జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మొక్కలను నాటుతున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్‌గఫార్

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దూర మవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే మంచి ఆరోగ్యం కల్గుతుందన్నారు. దోమల ఉత్పత్తి చెందకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ఇంటినుంచి, దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్డుపై కాలువలపై వేయకుండా మున్సిపల్ కార్మికులకు అందచేయాలని, లేదా మున్సిపల్ చెత్త రిక్షాలో వేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో పరిశుభ్రత కార్యక్రమాలు చేయించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే డయాలసిస్ సెంటర్ వెనుక భాగం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పచ్చదనం పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.